





# కరపత్రం

SINCE 2014

శుక్రవారం నవంబర్ 28 2025 | సంపుటి : 2 | సంచిక : 54 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4




# గ్లోబల్ సమ్మిట్‌పై సీఎం రేవంత్ సమీక్ష

## పాలసీ డాక్యుమెంట్ పై భేటీలో చర్చ

హైదరాబాద్,నవంబర్27 :
తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025పై రోజూ వరుస సమీక్షలు చేపట్టిన సీఎం రేవంత్ రెడ్డి గురువారం పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో రోజుకో అంశంపై చర్చిస్తున్నారు. తెలంగాణ రైజింగ్-2047 పాలసీ డాక్యుమెంట్‌పై ఈ భేటీలో చర్చించారు. పాలసీ డాక్యుమెంట్‌పై సీఎం రేవంత్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర అభివృద్ధిని ప్రతిబింబించేలా.. తెలంగాణ రైజింగ్-2047 పాలసీ డాక్యుమెంట్ ఉండాలని సూచించారు. 2034 నాటికి ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దేలా స్పష్టమైన రోడ్ మ్యాప్ పాలసీలో ఉండాలని స్పష్టం చేశారు. తెలంగాణ ఆర్థికాభివృద్ధిని మూడు రీజియన్లుగా విభజించి అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. తెలంగాణ పాలసీ, భవిష్యత్ ప్రణాళికలు వివరించేలా పాలసీ డాక్యుమెంట్ ఉండాలని అధికారులకు సూచించారు. కాగా డిసెంబర్ 8,9 తేదీల్లో ఈ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ జరగనున్న విషయం తెలిసిందే. ఈ ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించనున్నట్లు సీఎం రేవంత్ ఇప్పటికే వెల్లడించారు. కేంద్ర మంత్రులతో పాటు సమ్మిట్‌కు ఆహ్వానించాల్సిన దేశ, విదేశాలకు చెందిన వ్యాపారవేత్తలు, ప్రముఖుల జాబితా ముందుగానే సిద్ధం చేసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు.



# మొదలైన పంచాయతీ ఎన్నికల సందడి..

» నోటిఫికేషన్ విడుదల.. నామినేషన్లు షురూ!

» మూడు విడతల్లో జరగనున్న ఎన్నికలు

హైదరాబాద్,నవంబర్27 :
తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు రాజకీయ సందడి మొదలైంది. రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) తొలి విడత ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఎన్నికలు మూడు విడతల్లో జరగనున్నాయి. తొలి విడత పోలింగ్ డిసెంబర్ 11న, రెండో విడత డిసెంబర్ 14న, మూడో విడత డిసెంబర్ 17న జరిగేలా షెడ్యూల్ ఖరారు చేశారు. ఈ పంచాయతీ ఎన్నికలు 12,760 గ్రామ పంచాయతీలు, 1,13,534 వార్డులకు జరుగుతాయి. నోటిఫికేషన్ విడుదల కావడంతో పలు చోట్ల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.తొలి దశ నామినేషన్లు వేస్తున్నారు అభ్యర్థులు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం ఉదయం 10:30 నిమిషాల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయడానికి అవకాశం కల్పించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 555 పంచాయతీలు, 4952 వార్డు స్థానాలకు మొదటి విడత ఎన్నికలు జరుగుతున్నాయి. గురువారం నుంచి ఈ నెల 29వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగుతోంది. వరంగల్ 91 పంచాయతీలు, 800ల వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. హనుమకొండ జిల్లా 69 పంచాయతీలు , 658 వార్డు స్థానాలు, మహబూబాబాద్ జిల్లా 155 పంచాయతీలు, 1338 వార్డు స్థానాలు, జనగామ జిల్లా 110 పంచాయతీలు,1024 వార్డు స్థానాలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా 82 పంచాయతీలు, 712 వార్డు స్థానాలు, ములుగు జిల్లా 48 పంచాయతీలు, 420 వార్డు స్థానాలకు గానూ ఎన్నికలు జరుగుతున్నాయి. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్లు ప్రారంభమయ్యాయి. మొదటి విడతలో 630 గ్రామ పంచాయతీలు, 5,598 వార్డులకు నామినేషన్స్ స్వీకరిస్తున్నారు.

మిగతాద్ది 2 లో



## కొత్తగా చేపట్టే థర్మల్ విద్యుత్ ప్లాంట్లపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారు

-మంత్రి ఉత్తమ్

హైదరాబాద్:
నగరంలోని పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలించాలనేది తమ ప్రణాళిక అని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హిల్ట్ పాలసీ ఎన్నో రకాలుగా ప్రయోజనకరమని పేర్కొన్నారు.

మిగతాది 2లో



## 2015 గ్రూప్-2 ర్యాంకర్లకు హైకోర్టులో ఊరట

హైదరాబాద్:
తెలంగాణలో 2015 గ్రూప్-2 ర్యాంకర్లకు హైకోర్టులో ఊరట లభించింది. గ్రూప్-2పై సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సీజే ధర్మాసనం సస్పెండ్ చేసింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సింగిల్ బెంచ్ తీర్పును టీజీపీఎస్సీ డివిజన్ బెంచ్‌లో సవాల్ చేయగా..

# రాజకీయాల్లో గెలుపోటములు సహజం

▪ మళ్లీ గెలుస్తాం...కెసిఆర్‌ను సిఎంను చేస్తాం

▪ తెలంగాణ భవన్‌లో వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్

## అసలు యుద్ధం 2028లో ఉంటుంది




హైదరాబాద్,నవంబర్ 27 :
రాజకీయాల్లో గెలుపోటములు సహజమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మళ్లీ గెలుస్తాం..అధికారంలోకి వస్తామని కెటిఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి ఎపిలో కల్వకుర్తిలో ఎన్టీఆర్ కూడా ఓడిపోయారని ఆయన గుర్తుచేశారు. అసలు యుద్ధం 2028లో ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ప్రజల సమక్షంలో బయట పెడుదామని పిలుపు నిచ్చారు. కల్వకుర్తి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు జరిగాయి. తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కేటీఆర్ సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. బానిసత్వం లేని ఒకే ఒక్క పార్టీ గులాబీ పార్టీ అని తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 8 లక్షల ఎకరాలకు కేసీఆర్ సాగునీరు ఇచ్చారని కేటీఆర్ తెలిపారు. లక్ష్మీదేవిపల్లి 660 మీటర్ల ఎత్తు ఉంటుందని పేర్కొన్నారు. కాళేశ్వరం, పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టులను కేసీఆర్ చేపట్టారని అన్నారు. గొలుసుకట్టు రిజర్వాయర్లను 90 శాతం పనులు పూర్తి చేశారని తెలిపారు. ఒక పంపును కూడా కేసీఆర్ ప్రారంభించారని చెప్పారు. పాలమూరు ప్రాజెక్టుకు జైపాల్ రెడ్డి పేరు పెట్టడం తప్ప రేవంత్ రెడ్డి చేసిందేమీ లేదని విమర్శించారు. కరెంట్ కష్టాలతో ఎంతమంది చనిపోయారో మీకంతా తెలుసని కేటీఆర్ గుర్తుచేశారు. వైఎస్ హయాంలో ఉచిత కరెంట్ ఇచ్చినా.. ఆరు గంటలే ఇచ్చారని అన్నారు. కాంగ్రెస్ హయాంలో దొంగలు కొట్టే సమయంలో కరెంటు ఇచ్చేవారని తెలిపారు.

మిగతాద్ది 2 లో




## రిజర్వేషన్ల పేరుతో బీసీలను కాంగ్రెస్ మోసం చేసింది

సిద్దిపేట:
స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల పేరుతో బీసీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మోసం చేశారని మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి.. కేవలం 17 శాతమే ఇచ్చారన్నారు. కేసీఆర్.. పండుగ కోసం చీరలిస్తే రేవంత్‌రెడ్డి మాత్రం ఓట్ల కోసమే చీరలు పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రికి ఎంతసేపూ ఓట్ల రాజకీయమే తప్ప.. రాష్ట్ర ప్రయోజనాల మీద శ్రద్ధ లేదన్నారు. సిద్దిపేటలోని భారత రాష్ట్ర సమితి జిల్లా కార్యాలయంలో గురువారం దీక్షా దివస్ సన్నాహక సమావేశం నిర్వహించారు.

2 లో




# అబద్ధాలకు అంబాసిడర్ కెటిఆర్

» అబద్ధపు ప్రచారాలతో ప్రజలు ఏమార్చే రకం

» బిసి రిజర్వేషన్లపై చేస్తున్న వ్యాఖ్యలు సత్యదూరం

» కెటిఆర్ వ్యాఖ్యలను గట్టిగా తిప్పికొట్టిన మంత్రి సీతక్క

హైదరాబాద్,నవంబర్ 27 :
స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను 17 శాతానికి తగ్గించిందన్న బిఆర్ఎస్ నేత కేటీఆర్ వ్యాఖ్యలను మంత్రి సీతక్క తిప్పికొట్టారు. అబద్ధపు ప్రచారాలతో ప్రజలను ఏమార్చలేరని గట్టిగా జవాబు ఇచ్చారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. అబద్దాలకు అంబాసిడర్‌గా మారి కేటీఆర్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని బీసీలు విశ్వసించరని తెలిపారు.



మిగతాది 2లో

## సిగాచీ పరిశ్రమలో పేలుడు ఘటన.. పోలీసుల దర్యాప్తు తీరుపై హైకోర్టు ఆగ్రహం

## ఢిల్లీలో తెలంగాణ ఈగల్ టీమ్ భారీ ఆపరేషన్..

### డ్రగ్స్ నెట్‌వర్క్‌లపై దాడులు



2లో..

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ ఓఎస్డీని ప్రశ్నించిన




హైదరాబాద్:
ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఓఎస్డీ రాజశేఖర్‌రెడ్డిని ప్రత్యేక దర్యాప్తు బృందం ప్రశ్నించింది. ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసింది. గురువారం జూబ్లీహిల్స్ పీఎస్‌లో రాజశేఖర్‌రెడ్డి విచారణకు హాజరయ్యారు. రెండు గంటలపాటు విచారణ జరిపి ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు సిట్ అధికారులు. గత ఏడాది మార్చిలో ఈ కేసు నిందితుడు రాధా కిషన్(టాస్క్ ఫోర్స్ మాజీ డీసీపీ) ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగానే కేసీఆర్ ఓఎస్డీని విచారించినట్లు తెలుస్తోంది. రాధాకిషన్ తన స్టేట్‌మెంట్‌లో మాజీ సీఎం కేసీఆర్ పేరును ప్రస్తావించారు. కేసీఆర్ కుటుంబం సభ్యులు, పార్టీలో సన్నిహితుల వ్యవహారాలను చక్కబెట్టేందుకు తాము పని చేశామని పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలోనే పదేళ్లపాటు కేసీఆర్‌కు ఓఎస్డీగా పని చేసిన రాజశేఖర్ రెడ్డిని సిట్ ప్రశ్నించింది.




## మర్డర్‌ను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరణ

» దర్యాప్తులో హత్యగా తేల్చిన పోలీసులు

» గద్వాల జిల్లాలో మాజీ సర్పంచ్ హత్య కేసు ఛేదన

గద్వాల,నవంబర్ 27:

# మర్డర్‌ను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరణ

మొదటి పేజీ తరువాయి

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ఓ మాజీ సర్పంచ్ కేసును పోలీసులు ఛేదించారు. ఇది హత్యగా ధృవీకరించారు. ఓ పక్కా ప్లాన్ ప్రకారం మాజీ సర్పంచ్‌ను మట్టుపెట్టారని గుర్తించారు. బొలెరో వాహనం వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ మాజీ సర్పంచి ఇటీవల ప్రాణాలు కోల్పోయారు. అంతా రోడ్డు ప్రమాదమని భావించారు. కుటుంబ సభ్యులు మాత్రం ప్రణాళిక ప్రకారం చేసిన హత్యగా అనుమానించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు చేపట్టి వారం రోజుల్లో కేసును ఛేదించారు. పైకి కనిపిస్తున్నట్లు అది ప్రమాదం కాదని.. రూ.25 లక్షలు సుపారీ ఒప్పందం కుదుర్చుకుని, నెల రోజులు రెక్కీ నిర్వహించి.. పక్కా ప్రణాళిక ప్రకారం చేసిన హత్యగా నిర్ధరించారు. జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం నందిన్నె మాజీ సర్పంచి చిన్నభీమ రాయుడిని సుపారీ గ్యాంగ్‌తో హత్య చేయించడం జిల్లాలో సంచలనం రేపింది. కేసు వివరాలను జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈనెల 21న నందిన్నె మాజీ సర్పంచి చిన్నభీమ రాయుడు ద్విచక్ర వాహనంపై గద్వాల నుంచి సొంతూరు నందిన్నెకు బయల్దేరారు. వెనుక నుంచి వచ్చిన బొలెరో ఆయన్ను బలంగా ఢీకొట్టింది. కొద్ది దూరం వాహనం సహా లాక్కెళ్లింది. ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. బొలెరో ముందు భాగంలో బైక్ ఇరుక్కు పోయింది. దీంతో డ్రైవర్ సహా.. అందులో ఉన్నవారంతా పరారయ్యారు. ఈ ఘటనను తొలుత ప్రమాదంగా భావించారు. కానీ, కుటుంబ సభ్యులు మాత్రం ప్రమాదం జరిగిన తీరు చూసి ఉద్దేశ్య పూర్వకంగానే ఢీ కొట్టారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసిన పోలీసులు వారం రోజుల్లో ప్రమాదం వెనక మిస్టరీని ఛేదించారు. రూ.25లక్షల సుపారీ

కుదుర్చుకుని పక్కా ప్రణాళిక ప్రకారం చేసిన హత్యగా పోలీసులు నిర్ధరించారు. నందిన్నె గ్రామానికి చెందిన మిల్లు వీరన్న అలియాస్ కురువ వీరన్నకు.. మృతుడు చిన్నభీమ రాయుడికి మధ్య భూ వివాదాలు, రాజకీయ కక్షలు ఉన్నాయి. వీరన్న రైస్ మిల్లులో అక్రమాలపై అధికారులు సోదాలు నిర్వహించి కేసు నమోదు చేశారు. దీంతో చిన్నభీమ రాయుడిపై వీరన్న మరింత కక్ష పెంచుకున్నాడు. ఆయన్ను హత్య చేయించేందుకు కర్నూలుకు చెందిన ఈశ్వరయ్య గౌడ్‌తో రూ.25 లక్షలు సుపారీ ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. హత్యచేసి దాన్ని ప్రమాదంగా చిత్రీకరిస్తే నేరం తమపైకి రాకుండా ఉంటుందని ప్రణాళిక రచించాడు. నెలరోజులు రెక్కీ నిర్వహించారు. నాలుగుసార్లు హత్యాయత్నం చేసినా.. పరిస్థితులు అనుకూలించలేదు. ఈ నెల 21న అదునుచూసి జాంపల్లి బస్టాండ్‌కు సమీపంలో చిన్నభీమ రాయుడు బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టారు. చనిపోయాడని నిర్ధరించుకునే వరకూ బైక్ సహా ఈడ్చుకెళ్లారు. బైక్ ముందు భాగంలో ఇరుక్కుపోవడంతో అక్కడే వదిలేసి పరారయ్యారు. ఈ కేసులో మిల్లు వీరన్న సహా 10మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

# మొదలైన పంచాయతీఎన్నికల సందడి..

మొదటి పేజీ తరువాయి

నల్గొండ జిల్లాలో నల్గొండ, చండూరు రెవెన్యూ డివిజన్లలోని 318 గ్రామ పంచాయతీలు, 2,870 వార్డులకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. సూర్యాపేట జిల్లాలో సూర్యాపేట, తుంగతుర్తి రెవెన్యూ డివిజన్లలోని 159 గ్రామ పంచాయతీలు, 1,442 వార్డులకు నామినేషన్లు జరుగుతోంది. యాదాద్రి - భువనగిరి జిల్లాలో భువనగిరి రెవెన్యూ డివిజన్‌లోని 153 గ్రామ పంచాయతీలు, 1,286 వార్డులకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఈరోజు ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్స్ స్వీకరిస్తున్నారు.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో... తొలి విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పర్వం మొదలైంది. ఆదిలాబాద్ జిల్లాలో 166, మంచిర్యాల జిల్లాలో 90, నిర్మల్ జిల్లాలో 136, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 114 సర్పంచ్, వార్డు స్థానాలకు తొలివిడత ఎన్నికలు జరుగుతోంది.

అయితే, హైకోర్టు ఆదేశాల కారణంగా ములుగు, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లోని 32 పంచాయతీలకు ఎన్నికలు జరగవు. తొలి విడతకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలవ్వడంతో.. ఈ దశలో 189 మండలాల్లో 4,236 గ్రామ పంచాయతీలకు, 37,440 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలతో పాటు ఉపసర్పంచ్ ఎన్నిక కూడా అదే రోజు పూర్తి చేయాలని ఎస్ఈసీ కమిషనర్ రాణి కుముదిని ప్రకటించారు. తొలి విడతకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. రోజూ ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. తొలి విడత నామినేషన్ల సమర్పణకు చివరి తేదీ నవంబర్ 29. ఆ తర్వాత నవంబర్ 30న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. నామినేషన్ల ఉపసంహరణకు డిసెంబర్ 3 వరకు అవకాశం ఉంది. డిసెంబర్ 11న పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుంది. ఈ ఎన్నికల కోసం గ్రామాల్లో ఫొటోతో కూడిన ఓటర్ల జాబితాలను ప్రదర్శిస్తారు. బ్యాలెట్ పేపర్లతో ఓటింగ్ జరుగుతుంది. నోటా (నాన్ ఆఫ్ ది అబౌవ్) ఆప్షన్ కూడా ఉంటుంది.పోలింగ్ పూర్తయిన అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి లెక్కింపు ప్రారంభమై, పూర్తయిన వెంటనే ఫలితాలు ప్రకటిస్తారు. ఉప సర్పంచ్ ఎన్నిక కూడా అదే రోజు లేదా తదుపరి రోజు పూర్తి అవుతుంది. మొత్తం 31 జిల్లాల్లో 545 మండలాల్లో ఈ ఎన్నికలు జరుగుతాయి. ఓటర్ల సంఖ్య 1.66 కోట్లు, వీరిలో మహిళలు 85.12 లక్షలు, పురుషులు 81.42 లక్షలు ఉన్నారు. రిజర్వేషన్ల పట్ల వివాదాలు ఉన్నప్పటికీ, బీసీలకు 17.08 శాతం (2,176 పంచాయతీలు) కేటాయించారు. దీనిపై బీసీ సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.ఈ ఎన్నికలు గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు కీలకం. గత 20 నెలలుగా ప్రత్యేక అధికారులు పరిపాలన చేస్తున్నారు. ఇప్పుడు కొత్త నాయకులు ఎన్నికయ్యే అవకాశం ఉంది. ఎస్ఈసీ ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబర్ (9240021456) ఉంది. మొబైల్ యాప్ ద్వారా కూడా ఫిర్యాదులు నమోదు చేయవచ్చు. ఈ ఎన్నికలతో గ్రామాల్లో మార్పు రావాలని ఆశిస్తున్నారు. మొత్తం ప్రక్రియ డిసెంబర్ 17తో ముగుస్తుంది. ఓటర్లు తమ హక్కును వాడుకోవాలని ఎస్ఈసీ పిలుపునిచ్చింది.

## శ్రీలంక తీరంలో కేంద్రీకృతమైన తుపాన్

- తుఫాన్‌కు దిత్వాహ్‌గా నామకరణం
- మత్స్యకారులను అప్మత్తం చేసిన అధికారులు
- ఎపిలో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిక

నైరుతి బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న శ్రీలంక తీరంలో తీవ్ర వాయుగుండం.. తుపానుగా మారిందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ తుపానుకు 'దిత్వాహ్'గా యెమన్ దేశం నామకరణం చేసినట్టు అధికారులు తెలిపారు. ఉత్తర తమిళనాడు-పుదుచ్చేరికి ఆనుకుని ఉన్న దక్షిణ కోస్తా తీరం వైపు గడిచిన 6 గంటల్లో గంటకు 15 కి.మీ వేగంతో తుపాను కదులు తోందని పేర్కొన్నారు. దిత్వాహ్ తుపాను శ్రీలంక ట్రింకోమలీకి 200 కి.మీ, పుదుచ్చేరికి 610 కి.మీ, చెన్నైకి ఆగ్నేయంగా 700 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఆదివారం తెల్లవారుజామున నైరుతి బంగాళాఖాతం ఆనుకుని తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణకోస్తా తీరాలకు చేరే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. దీంతో రాష్ట్రంలోని అన్ని ఓడరేవుల్లో రెండో నంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఈనెల 30న ప్రకాశం, నెల్లూరు, కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో అత్యంత భారీ వర్షం కురిసే అవకాశముందని రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఆయా జిల్లాల్లో 20 సెం.మీకు పైగా వర్షపాతం నమోదయ్యే అవకాశముందని విపత్తు నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు. రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.శ్రీలంకను అనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో తుఫాన్ ఏర్పడింది. ఈ మేరకు విశాఖపట్నంలోని తుఫాన్ హెచ్చరికల కేంద్రం ఉన్నతాధికారి జగన్నాథ కుమార్ వెల్లడించారు. ఈ తుఫాన్ కారణంగా రానున్న వారం రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు కురుస్తాయని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు.. మరికొన్ని ప్రదేశాల్లో భారీ వర్షాల నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ సమయంలో తీరం వెంబడి గరిష్టంగా 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. కాబట్టి సముద్రంలో వేటకు వెళ్ళ వద్దని మత్స్యకారులను హెచ్చరించారు. తీరం వెంబడి ఉన్న పోర్టులో రెండో నెంబరు ప్రమాద హెచ్చరికను జారీ చేశామని జగన్నాథ కుమార్ వివరించారు. ఇక దిత్వా తుఫాన్ కారణంగా.. శనివారం నుంచి సోమవారం వరకు అంటే.. నవంబర్ 29 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు భారీ వర్షాలు కురుస్తాయిన అంచనా వేస్తున్నారు. 29వ తేదీన అన్నమయ్య, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. ఇక 30వ తేదీన నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, ప్రకాశం, వైఎస్ఆర్ కడప జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. తెలంగాణలో పూర్తిగా భిన్న పరిస్థితులు ఉన్నాయి. మొన్నటి వరకు తెలంగాణలో చలి తీవ్రత అధికంగా ఉంది. కానీ గత నాలుగు రోజులుగా ఈ తీవ్రత తగ్గింది.ం

## బతుకమ్మకుంట వ్యవహారం

### హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం

**డిసెంబర్ 5లోపు కోర్టు ఎదుట హాజరుకు ఆదేశం**

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. బతుకమ్మకుంట వివాదంలో డిసెంబర్ 5వ తేదీ లోపు కోర్టు ఎదుట ప్రత్యక్షంగా హాజరు కావాలని ఏవీ రంగనాథ్‌ను ఆదేశించింది. లేకుంటే నాన్ బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేస్తామని హైకోర్టు హెచ్చరించింది. బతుకమ్మకుంట వ్యవహారంలో హైకోర్టుకు ఏవీ రంగనాథ్ హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో ఆయనపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. బతుకమ్మకుంటలోని ప్రైవేట్ స్థలంపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ ప్రైవేట్ స్థలంలో ఎటువంటి మార్పులు చేర్పులు చేయవద్దంటూ ఈ ఏడాది జూన్12వ తేదీన కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ ఉత్తర్వులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఉల్లంఘిం చారంటూ ఎడ్ల సుధాకర్ రెడ్డి అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ ప్రైవేట్ స్థలంలో ఎటువంటి చర్యలు తీసుకో వద్దంటూ ఆయన సూచించింది. అంతేకాకుండా వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలంటూ రంగనాథ్‌ను ఆదేశించింది. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరిగింది. కానీ కోర్టుకు హైడ్రా కమిషనర్ హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో హైకోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఇదిలావుంటే ఇప్పటికే ఇక్కడ సుందరీకరణ పనులు సాగాయి. పూర్వవైభవం తీసుకుని వచ్చారు. ఇటీవల సిఎం రేవంత్ తదితరులు కలిసి ప్రారంభించారు.

## రిజర్వేషన్ల పేరుతో బీసీలను కాంగ్రెస్ మోసం చేసింది

మొదటి పేజీ తరువాయి

పార్టీ జిల్లా అధ్యక్షుడు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. నవంబరు 29.. చరిత్రను మలుపుతిప్పిన రోజన్నారు. కేసీఆర్ దీక్ష, అమరుల త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం సాకారమైందన్నారు. రాష్ట్ర సాధనకు ఉద్యమగడ్డ అయిన సిద్దిపేటలో 1,531 రోజుల పాటు దీక్షలు కొనసాగటం చరిత్ర అన్నారు. నవంబరు 29 నుంచి డిసెంబరు 9 వరకు నిర్వహించనున్న కార్యక్రమాలపై చర్చించారు.

## కొత్తగా చేపట్టే థర్మల్ విద్యుత్ ప్లాంట్లపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారు

మొదటి పేజీ తరువాయి

దీని వల్ల ప్రభుత్వానికి ఆదాయం కూడా వస్తుందని.. దాన్ని సంక్షేమ, అభివృద్ధి పనులకు ఉపయోగిస్తామని వివరించారు.

" ఏం చేసినా ప్రభుత్వాన్ని తప్పుపట్టాలనే ధోరణి ప్రతిపక్ష నేతల్లో కనిపిస్తోంది. కొత్తగా చేపట్టే థర్మల్ విద్యుత్ ప్లాంట్లపై కూడా అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారు. విభజన చట్టం ప్రకారం నిర్మించాల్సిన విద్యుత్ ప్లాంట్ ఎందుకు పూర్తి చేయలేదో చెప్పాలి. భద్రాద్రి విద్యుత్ ప్లాంట్ నిర్మాణాన్ని కాలం చెల్లిన పద్ధతిలో గత ప్రభుత్వం చేపట్టింది. సబ్ క్రిటికల్ పద్ధతి వల్ల ఆర్థికంగా, పర్యావరణం పరంగా తీవ్రమైన నష్టం. భద్రాద్రి పవర్ ప్లాంట్‌ను పూర్తిగా వినియోగించుకోలేని పరిస్థితి. యాదాద్రి పవర్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి కూడా భారంగా మారింది. ఛత్తీస్‌గఢ్ నుంచి చేసిన విద్యుత్ కొనుగోళ్లలోనూ అవకతవకలు జరిగాయి. ఇంకా మంజూరు చేయని, నిర్మాణం జరగని విద్యుత్ ప్లాంట్‌లో అవినీతి ఎలా జరుగుతుంది" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు.

రామగుండం, పాల్వంచ, మక్తల్‌లలో మూడు కొత్త థర్మల్ పవర్ ప్లాంట్లను నిర్మించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించడం వెనుక.. దాదాపు రూ.50 వేల కోట్ల స్కామ్ దాగి ఉందని భారత రాష్ట్రసమితి నేతలు ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే.

## ఢిల్లీలో ఈగిల్ టీమ్ భారీ ఆపరేషన్

**డ్రగ్ కార్టెల్‌లో ఉన్న 50మంది నైజీరియన్ల అరెస్ట్**

దేశరాజధాని ఢిల్లీ తెలంగాణ ఈగిల్ టీమ్ భారీ ఆపరేషన్ చేపట్టి డ్రగ్ కార్టెల్‌లో కీలక సభ్యులుగా ఉన్న 50 నైజీరియన్లను పట్టుకుంది. వీరంతా వీసా గడువు ముగిసినా మనదేశంలో తిష్టవేసి కూర్చుకున్నారు. మాదకద్రవ్యాలను అరికట్టేందుకు కృషిచేస్తున్న ఈగల్ పోలీసులు ఈ భారీ ఆపరేషన్లు పూర్తి చేశారు. దిల్లీ, గ్రేటర్ నొయిడా, గ్వాలియర్, విశాఖపట్నం కేంద్రంగా పనిచేస్తున్న డ్రగ్స్ నెట్‌వర్క్‌లపై ఏకకాలంలో దాడులు నిర్వహించారు. దిల్లీలో అక్కడి క్రైమ్ బ్రాంచ్ సమన్వయంతో ఈగల్ ఫోర్స్ మెగా ఆపరేషన్‌ను చేపట్టింది. ఈ సంయుక్త బృందంలో దిల్లీ క్రైమ్ బ్రాంచ్ నుంచి వందమంది అధికారులు, ఈగల్ ఫోర్స్ నుంచి 124 మంది అధికారులు పాల్గొన్నారు. మెహ్రౌలి, సంత్ నగర్, ప్రతాప్ ఎన్‌క్లేవ్, పృథ్వీ పార్క్, చంద్ర నగర్ తదితర 20కి పైగా ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. గడువు ముగిసిన వీసాలతో నివసిస్తున్న 50 మందికి పైగా నైజీరియన్లను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారంతా ఒక పెద్ద నైజీరియన్ డ్రగ్ కార్టెల్‌లో కీలక సభ్యులుగా ఉన్నట్లు గుర్తించారు. పలు ప్రాంతాల్లో భారీగా మాదకద్రవ్యాలు కూడా స్వాధీనం చేసుకున్నారు. గ్రేటర్ నొయిడా, గ్వాలియర్, విశాఖపట్నంలోనూ ఈగల్ ఫోర్స్ స్థానిక పోలీసుల సహకారంతో కీలక ఆపరేషన్లు చేపట్టింది. ఆయా ప్రాంతాల్లో డ్రగ్ కింగ్‌పిన్‌లను, సెక్స్ వర్కర్లుగా వ్యవహరిస్తూ డ్రగ్స్ విక్రయించే మహిళలు, మ్యూల్ ఖాతాదారులను గుర్తించింది. ముందస్తు పక్కా సమాచారంతో ఈగిల్ బృందం అక్కడి పోలీసుల సహకారంతో దీనిని చేపట్టింది. నైజీరియన్లను విచారిస్తే మరిన్ని వివరాలు రాబట్టవచ్చని అధికారులు భావిస్తున్నారు.

## రాజకీయాల్లో గెలుపోటములు సహజం

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ హయాంలో కరెంటు రాలేదని రేవంత్ రెడ్డే చెప్పాడని అన్నారు. కేసీఆర్ హయాంలో మిషన్ భగీరథ, సాగునీరు తెచ్చుకున్నామని తెలిపారు. రైతుకు పెట్టుబడి రూ.73 వేల కోట్లు ఇచ్చారని తెలిపారు. మన పార్టీ నాయకుల అనైక్యతతోనే ఓడిపోయామని కేటీఆర్ అన్నారు. మనం చేసిన పనులు సరిగ్గా చెప్పుకోలేదని తెలిపారు. సోషల్‌మీడియాలో చెప్పిన అబద్దాలను ప్రజలు నమ్మారని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.93వేల కోట్ల ఖర్చు అయ్యిందని.. కానీ రాహుల్ గాంధీ వచ్చి రూ.లక్ష కోట్ల కుంభకోణం అంటే ప్రజలు నమ్మారని అన్నారు. ప్రజలు ఆరు గ్యారంటీల గారడిలో పడి మోసపోయారని తెలిపారు. కల్వకుర్తిలో ఆస్పత్రి లేదని ఎమ్మెల్యే నారాయణ రెడ్డి మాట్లాడుతున్నాడని.. 60 ఏండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించారు. పదేండ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ బాధ్యుడా అని నిలదీశారు. 420 హామీలను కాంగ్రెస్ నాయకులు తుంగలో తొక్కారని కేటీఆర్ విమర్శించారు. ఇప్పుడు ఏం చేశావని సీఎం రేవంత్ రెడ్డిని నిలదీస్తే ఫ్రీ బస్సు అంటున్నాడని తెలిపారు. మహిళలకు ఫ్రీ అంటూ పురుషులకు డబుల్ రేట్లు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి రైతుబంధు ఎగ్గొట్టేసరికి కేసీఆర్ గుర్తుకొచ్చిండు అని కేటీఆర్ అన్నారు. ఏ ఊళ్లో అయినా పది మంది గుమిగూడితే.. తొందరగా కేసీఆర్‌ను తెచ్చుకోవాలని అనుకుంటున్నారని తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని వ్యాఖ్యానించారు.

## 2015 గ్రూప్-2 ర్యాంకర్లకు హైకోర్టులో ఊరట

మొదటి పేజీ తరువాయి

విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం ఈ మేరకు తీర్పు వెలువరించింది.2015-16 గ్రూప్-2ను రద్దు చేస్తూ ఇటీవల హైకోర్టు సంచలన తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. నాటి ఎంపిక జాబితాను కొట్టివేసింది. హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పు, సాంకేతిక కమిటీ సిఫార్సులకు విరుద్ధంగా డబుల్ బబ్లింగ్, వైట్‌నర్ వినియోగం, తుడిపివేతలున్న పార్ట్-బి పత్రాలను పునర్ మూల్యాంకనం చేయడం చెల్లదని పేర్కొంది. హైకోర్టు తీర్పు, సాంకేతిక కమిటీ సిఫార్సులకు విరుద్ధంగా వ్యవహరించే అధికారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు లేదని తేల్చి చెప్పింది.

జవాబు పత్రాల్లో ట్యాంపరింగ్ జరిగిందని స్పష్టంగా కనిపిస్తున్నపుడు వాటిని పక్కన పెట్టకపోవడం కమిషన్ వైఫల్యమేనని తేల్చి చెప్పింది. 2019 అక్టోబరు 24న ఇచ్చిన ఫలితాలు ఏకపక్షమని, చట్టవిరుద్ధమని వాటిని రద్దు చేసింది. సాంకేతిక కమిటీ సిఫార్సులు, హైకోర్టు తీర్పునకు అనుగుణంగా తిరిగి మూల్యాంకనం నిర్వహించి అర్హుల జాబితాను విడుదల చేసి నియామకాలు చేపట్టాలని, ఈ ప్రక్రియను 8 వారాల్లో పూర్తి చేయాలని పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు ఆదేశాలు జారీ చేసింది.

## సిగాచీ పరిశ్రమలో పేలుడు ఘటన.. పోలీసుల దర్యాప్తు తీరుపై హైకోర్టు ఆగ్రహం

మొదటి పేజీ తరువాయి

సిగాచీ పరిశ్రమలో పేలుడు ఘటనలో పోలీసుల దర్యాప్తు తీరుపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది సాధారణ ఘటన కాదని.. 54 మంది కార్మికులు చనిపోయారని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ అన్నారు. "ఈ ప్రమాదంపై ఇంకా దర్యాప్తు కొనసాగుతోందని చెప్పడం ఏంటి? 237 మంది సాక్షులను విచారించినా దర్యాప్తులో పురోగతి లేదా? పేలుడు ఘటనకు ఇప్పటివరకు బాధ్యులను గుర్తించలేదా? పేలుడుపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి ఉండొచ్చు కదా? ఇంత పెద్ద ఘటన జరిగితే దర్యాప్తు అధికారిగా డీఎస్పీని నియమిస్తారా?" అని ప్రశ్నించారు. ఈ ఘటనపై దాఖలైన పిల్‌పై విచారణ సందర్భంగా సీజే ఈమేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. పోలీసుల దర్యాప్తుపై నివేదిక ఇవ్వాలని ఏఏజీని ఆదేశించారు. తదుపరి విచారణకు దర్యాప్తు అధికారి కోర్టు ఎదుట హాజరుకావాలన్నారు. తదుపరి విచారణను వచ్చే నెల 9కి వాయిదా వేశారు.

## దిల్లీలో తెలంగాణ ఈగల్ టీమ్ భారీ ఆపరేషన్..

మొదటి పేజీ తరువాయి

మాదకద్రవ్య రహిత తెలంగాణే లక్ష్యంగా పనిచేస్తున్న ఈగల్ పోలీసులు భారీ ఆపరేషన్లు పూర్తి చేశారు. దిల్లీ, గ్రేటర్ నొయిడా, గ్వాలియర్, విశాఖపట్నం కేంద్రంగా పనిచేస్తున్న డ్రగ్స్ నెట్‌వర్క్‌లపై ఏకకాలంలో దాడులు నిర్వహించారు. దిల్లీలో అక్కడి క్రైమ్ బ్రాంచ్ సమన్వయంతో ఈగల్ ఫోర్స్ మెగా ఆపరేషన్‌ను చేపట్టింది. ఈ సంయుక్త బృందంలో దిల్లీ క్రైమ్ బ్రాంచ్ నుంచి 100 మంది అధికారులు, ఈగల్ ఫోర్స్ నుంచి 124 మంది అధికారులు పాల్గొన్నారు. మెహ్రౌలి, సంత్ నగర్, ప్రతాప్ ఎన్‌క్లేవ్, పృథ్వీ పార్క్, చంద్ర నగర్ తదితర 20కి పైగా ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు.

గడువు ముగిసిన వీసాలతో నివసిస్తున్న 50 మందికి పైగా నైజీరియన్లను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారంతా ఒక పెద్ద నైజీరియన్ డ్రగ్ కార్టెల్‌లో కీలక సభ్యులుగా ఉన్నట్లు గుర్తించారు. పలు ప్రాంతాల్లో భారీగా మాదకద్రవ్యాలు కూడా స్వాధీనం చేసుకున్నారు. గ్రేటర్ నొయిడా, గ్వాలియర్, విశాఖపట్నంలోనూ ఈగల్ ఫోర్స్ స్థానిక పోలీసుల సహకారంతో కీలక ఆపరేషన్లు చేపట్టింది. ఆయా ప్రాంతాల్లో డ్రగ్ కింగ్‌పిన్‌లను, సెక్స్ వర్కర్లుగా వ్యవహరిస్తూ డ్రగ్స్ విక్రయించే మహిళలు, మ్యూల్ ఖాతాదారులను గుర్తించింది.

## అబద్దాలకు అంబాసిడర్ కెటిఆర్

మొదటి పేజీ తరువాయి

కేటీఆర్ ప్రచారం చేస్తున్నట్లుగా బీసీల రిజర్వేషన్‌లు ఎక్కడా తగ్గలేదని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు తగ్గించి గొంతు కోసిందే బీఆర్ఎస్ అని ఆరోపించారు. 2014లో జరిగిన స్థానిక ఎన్నికల్లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిందని.. కానీ 2019 ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22 శాతానికి తగ్గించిందని గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్లను తగ్గించి తడిబట్టతో బీసీల గొంతు కోసింది బీఆర్ఎస్ అంటూ విరుచుకుపడ్డారు. ఇప్పుడు బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదన్నారు. గత స్థానిక ఎన్నికల్లో రాష్ట్రం యూనిట్‌గా సర్పంచుల రిజర్వేషన్లు ఖరారు చేశారని.. కానీ ఆ విధానాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టిందన్నారు. సర్పంచుల రిజర్వేషన్ల ఖరారుకు రాష్ట్రం యూనిట్‌గా కాకుండా మండలాన్ని యూనిట్‌గా తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని తెలిపారు. అందుకోసం ప్రత్యేకంగా డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కూడా చెప్పిందని సుప్రీం తీర్పును మంత్రి గుర్తుచేశారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేసి, దాని సిఫార్సు మేరకు మండలం యూనిట్‌గా సర్పంచుల రిజర్వేషన్ల నిర్ణయం జరిగిందన్నారు. ఆయా మండలాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీల జనాభాను బట్టి సర్పంచుల రిజర్వేషన్లు ఖరారు అయ్యాయని తెలిపారు. అందుకే కొన్ని మండలాల్లో రిజర్వేషన్లు పెరిగినట్లుగా, మరికొన్ని మండలాల్లో తగ్గినట్లుగా పైకి కనిపిస్తున్నా, స్టేట్ యూనిట్‌గా చూస్తే ఎక్కడా రిజర్వేషన్లు తగ్గలేదని వెల్లడించారు. ఏ మండలంలో కూడా రిజర్వేషన్లు 50 శాతానికి మించి ఉండరాదని సుప్రీంకోర్టు ఆదేశించిందన్నారు. రిజర్వేషన్ల ఖరారులో సుప్రీంకోర్టు తీర్పులను అమలు చేశామని వివరించారు. సుప్రీం తీర్పును అపహాస్యం చేసినట్లుగా కేటీఆర్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కుల గణన చేపట్టి పక్కాగా రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని తెలిపారు. కుల గణనలో పాల్గొనని కేసీఆర్ కుటుంబం, బీసీ రిజర్వేషన్లపై సన్నాయి నొక్కులు నొక్కుతోందని వ్యాఖ్యలు చేశారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పిస్తామని... అందుకోసం అవసరమైన అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. అసెంబ్లీలో తీర్మానం చేశామని.. జంతర్ మంతర్‌లో స్వయంగా సీఎం నేతృత్వంలో ధర్నా చేపట్టామని మంత్రి అన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కేంద్ర ప్రభుత్వం చేతుల్లో ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా, కాంగ్రెస్‌ను విమర్శిస్తూ బీజేపీ బీ టీంగా బీఆర్ఎస్ వ్యవహరిస్తోందని ఆరోపించారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ అమలు చేస్తోందన్నారు. బీసీలకు 42 శాతం సీట్లు బీఆర్ఎస్ ఇస్తుందా లేదా చెప్పాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు.

# అయిలాపూర్ లో వైభవంగా మల్లన్న జాతర



**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం ప్రతినిధి**
కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామంలో శ్రీశ్రీ శ్రీ సుబ్రహ్మణ్యం షష్ఠి శ్రీ పూదోట మల్లన్న స్వామి వారి జాతర జరిగింది. జాతరలో భాగంగా బుధవారం స్వామి వారి కళ్యాణం, శివ శక్తుల ఒగ్గు డోలు నృత్యాల నడుమ జాతర వైభవంగా జరిగింది. అనంతరం భక్తి శ్రద్ధలతో తయారు చేసిన బెల్లపు అన్నాన్ని బోనంగా సమర్పించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. సాయంత్రం స్వామి వారిని పల్లకిలో గ్రామంలోని దేవాలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు.

# దమ్మాయిగూడలో పోచమ్మ, రేణుక, ఎల్లమ్మ విగ్రహా ప్రతిష్ఠ



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ నియోజకవర్గం పరిధిలోని దమ్మాయిగూడ మున్సిపాలిటీ, చీర్యాల గ్రామంలో పోచమ్మ, రేణుక, ఎల్లమ్మ దేవతల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగింది.
ఈ ధార్మిక కార్యక్రమానికి మేడ్చల్%-%మల్కాజ్గిరి జిల్లా డీసీసీ అధ్యక్షుడు తోటకూరి వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన దేవతలకు అభిషేకం, అర్చనలు చేసి, గ్రామ ప్రజల సుఖశాంతులు, సమృద్ధి కోసం ప్రార్థించారు. ఇటువంటి కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యత, శాంతిని పెంపొందిస్తాయని, సాంప్రదాయాలకు ప్రాధాన్యతను పెంచుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ వేడుకలో స్థానిక నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.'

# హైకోర్టుకు చేరిన మందు పంచాయతీ




**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
నాగారం మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా ఏర్పాటైన వైన్‌షాప్‌తో పాటు పాత కనకదుర్గ వైన్స్ పై వివాదం బుధవారం హైకోర్టులో వేడెక్కింది. తాజాగా అనుమతి పొందిన నూతన వైన్‌షాప్‌పై మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి కోర్టు ఆశ్రయించగా, పాత కనకదుర్గ వైన్స్ పై జీవన్ రెడ్డిలు వేరు పిటిషన్ దాఖలు చేశారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం కోర్టులను వేదికగా ఉపయోగించుకోవద్దని హైకోర్టు హెచ్చరించింది.

# ఎన్నికల నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలి



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆదేశించారు. గురువారం మెట్పల్లి మండలం గొర్రెపల్లి, సాతారం, మల్లాపూర్ మండలం మొగిలిపేట, రాఘవపేట, కుస్తాపూర్, కొత్త దాంరాజ్ పల్లి గ్రామాలలో నామినేషన్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా, గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం రిజర్వేషన్ల వివరాలు నోటీసు బోర్డులపై అతికించిన నోటిఫికేషన్ పత్రాలను తనిఖీ చేశారు. ఎన్నికల ప్రక్రియ సక్రమంగా జరిగేలా చూడాలని ఆయన సూచించారు.

# మాతృమూర్తి జ్ఞాపకార్థం మందిరానికి విరాళం



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలో గురువారం, చిట్టాపూర్ వాస్తవ్యులు బండి గంగాధర్, రూపారాణి తమ మాతృమూర్తి స్వర్గీయ బండి గంగుబాయి నర్సయ్య జ్ఞాపకార్థకంగా శ్రీ శివ భక్త మార్కండేయ మందిర పునర్నిర్మాణంలో భాగంగా అతిథి గృహం కొరకు రూ. 5,11,116 విరాళంగా ఇచ్చి మహారాజ పోషకులుగా సభ్యత్వం స్వీకరించారు. ద్యావనపల్లి రాజారాం మాట్లాడుతూ, వీరికి, వీరి కుటుంబ సభ్యులకు శ్రీ శివభక్త మార్కండేయ, శ్రీ శక్తి గణపతి ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

# అధికార పార్టీ నాయకుడి వేధింపులు

## - వివోఏ దీక్ష విరమణ

**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
మల్లాపూర్ మండలం రేగుంట గ్రామానికి చెందిన వివోఏ సరిత, అధికార పార్టీ నాయకుడి వేధింపుల కారణంగా తన పదవి నుండి తొలగించబడ్డారని ఆరోపిస్తూ 17 రోజులుగా నిరాహార దీక్ష చేపట్టారు. గురువారం నాడు బీసీ సంఘాల నాయకులు ఆమె దీక్షా శిబిరానికి వెళ్లి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. అయితే, ఇప్పటికీ ఆమెకు న్యాయం జరగలేదని సమాచారం. ఈ కార్యక్రమంలో బీసీ జిల్లా అధ్యక్షులు ఇప్ప రమేష్, దేవ మల్లయ్య, రంగురామా గౌడ్, నిమ్మల భూమారెడ్డి, మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.



# ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు

**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం కోరుట్ల**
జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం, ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. జిల్లాలో తొలివిడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైన నేపథ్యంలో, మేడిపల్లి మండల కేంద్రం, కొండాపూర్, కల్వకోట, కట్లకుంట గ్రామాలు, అలాగే కోరుట్ల మండలంలోని మోహన్‌రావుపేట గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ పరిశీలనలో ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



# అయ్యప్ప స్వాముల మనోభావాలు దెబ్బతియ్యద్దు

**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**

**- ఆర్డీఓ శ్రీనివాస్ కు మెట్ పల్లి లో అయ్యప్ప స్వాముల వినతి**

అయ్యప్ప స్వాముల మనోభావాలు దెబ్బతియ్యద్దని నిరసిస్తు జగిత్యాల జిల్లా మెట్ పల్లి లోని అయ్యప్ప స్వామి అలయకమిటి, అఖిల భారత అయ్యప్ప స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం అయ్యప్ప ఆలయం నుండి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ గా వెళ్లి మెట్ పల్లి ఆర్డీఓ శ్రీనివాస్ కు వినతి పత్రం సమర్పించారు.



హిందువులు ఆరాధ్యంగా నమ్మే అయ్యప్ప స్వామి దీక్ష ను పోలీసు ఉన్నతాధికారి, తెలంగాణ డిజిపి అయ్యప్ప దీక్ష తీసుకోవాలనే వారు సెలవు పెట్టి దీక్ష తీసుకోవాలని అనటం పట్ల తీవ్ర నిరసనను తెలియజేశారు.
పోలీసులు అయ్యప్ప స్వామి ధీక్షను తిసుకుంటే వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవడాన్ని నిరసిస్తూ ..
హైదరాబాద్ పట్టణంలోని డీజీపీ కార్యాలయాన్ని అయ్యప్ప సేవాసమితి పిలుపుమేరకు డిజిపి కార్యాలయం ముట్టడించిన అయ్యప్పలను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మెట్ పల్లి లో ఆర్డీవో కార్యాలయం ముందు స్వాములు భజన నిర్వహించి ఆర్డీవో శ్రీనివాస్ కు వినతిపత్రం సమర్పించారు.
అయ్యప్ప స్వామిని ఎంతో భక్తి శ్రద్ధలతో పూజించే హిందువుల యొక్క మనోభావాలను దెబ్బతీసేలా అధికారులు చేపట్టిన చర్యలు ఉన్నాయని వెంటనే సర్క్యులర్ ఉపసంహరించాలని కోరారు.
ఈకార్యక్రమంలో ఆలయకమిటి కార్యనిర్వహణ అధ్యక్షుడు గంగుల వివేక్, ఆలయకమిటి అధ్యక్షుడు దోమ్మటి ప్రవీణ్, ఆలయకమిటి ఉపాధ్యక్షుడు అంకతి భరత్ కుమార్, కోశాధికారి బండారి మారుతి,అవుట్ల లక్ష్మణ్,బాసెట్టి హరీష్, మగ్రి నర్సయ్య, జిందం శ్రీనివాస్,నారోజి కిరణ్, సౌడాల సంజీవ్,ఆరె రమేష్, బండి మణిదీప్ గౌడ్, సాయి, బొడ్ల ఆనంద్,చింతల శ్రీకర్ గౌడ్,పడిగెల నరేందర్,కోటగిరి తిరుమల్,పుప్పాల రాజేష్ ఇతర భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎంపీ

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ అర్బన్ మండలం ఆరేపల్లి వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ ఢీకొని కరీంనగర్ పట్టణానికి చెందిన దంపతులు వసీం, ఐఫా మృతి చెందారు. చనిపోయిన మృతుల కుటుంబ సభ్యులను గురువారం వేములవాడ ఏరియా ఆసుపత్రిలో రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షులు, కరీంనగర్ మాజీ ఎంపీ బోయిన్ పెల్లి వినోద్ రావు పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



# వాకింగ్ స్టాండ్ అందజేత



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని నవంబర్ 27:**
గోదావరిఖని జవహర్ నగర్ లో నివాసం ఉండే కొమురయ్య గత కొద్దిగా కాలంగా అనారోగ్యంతో నడవలేక బాధపడుతునాడు. విషయం తెలుసుకున్న భరోసా సంస్థ నిర్వాహకురాలు నసీమా కొమురయ్యకు వాకింగ్ స్టాండ్ అందజేశారు. అదేవిధంగా కొమురయ్య త్వరగా కోలుకోవాలని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ స్వచ్ఛంద సేవకులు బొల్లం మధుబాబు, సరస్వతి పాల్గొన్నారు.

# మంథని నుండి అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణకు స్పెషల్ బస్సు ను వినియోగించుకోండి






**కరపత్రం ప్రతినిధి మంథని నవంబర్ 27**
మార్గశిర మాసం పౌర్ణమి సందర్భంగా డిసెంబర్ నెల 4 తేదిన తమిళనాడులోని అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణకు మంథని డిపో నుండి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును నడిపించనున్నట్లు డిపో మేనేజర్ వి. శ్రవణ్ కుమార్ తెలిపారు. డిసెంబర్ నెల 2వ తేదీన సాయంత్రం మంథని బస్టాండ్ నుంచి బయలుదేరి కరీంనగర్, హైదరాబాద్ మీదుగా కాణిపాకం మరియు గోల్డెన్ టెంపుల్ దర్శనం అనంతరం 3వ తేదీన రాత్రి అరుణాచలం చేరుకుంటుందన్నారు. 4వ తేదీన సాయంత్రం అరుణాచలం నుండి బయలుదేరి 5వ తేదీన ఉదయం శ్రీ అలంపూర్ జోగులాంబ అమ్మవారి దర్శనం అనంతరం బయలుదేరి కరీంనగర్ మీదుగా మంథని చేరుకుంటుందన్నారు. చార్జి ఒక్కరికి ఫుల్ టికెట్ రూ.5040 హాఫ్ టికెట్ రూ.3790 ఉంటుందని తెలిపినారు. టికెట్ బుకింగ్ కొరకు మంథని డిపో నందు గాని ఈ 9959225923 9948671514 నెంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

# జిల్లా పరిధిలో పోలీస్ యాక్ట్ అమలు

## - రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే

**కరపత్రం ప్రతినిధి రాజన్న సిరిసిల్ల**



శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నెల రోజుల (నవంబర్ 1వ తేది నుండి 30 వరకు) పాటు రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలీలు,పబ్లిక్ మీటింగ్లు, సభలు, సమావేశాలు నిర్వహించరదాని, నిబంధనలకు విరుద్ధంగా డిజే వినియోగించారాదని తెలిపారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు. కాబట్టి జిల్లా ప్రజలు పోలీసు వారికి ఇట్టి విషయంలో సహకరించాలని శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో నవంబర్ 29, 30 , డిసెంబర్ 1 తేదీలలో జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ నవంబర్ 27**

కరీంనగర్ జిల్లా విద్యాధికారి శ్రీరాం మొదయ్య , అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి , జిల్లా సైన్స్ అధికారి జయపాల్ రెడ్డి , ఇతర అధికారులతో కలిసి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో నిర్వహించినటువంటి వైజ్ఞానిక ప్రదర్శన సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా సృజనాత్మకతకు మారుపేరని , విద్యార్థుల ప్రతిభకు పట్టం కట్టేటువంటి గొప్ప జిల్లా అని ప్రతి సంవత్సరం కరీంనగర్ జిల్లా నుండి జపాన్ వెళ్లడానికి ఎంపిక అవుతున్నారని హర్షం వ్యక్తం చేస్తూ ఈ సంవత్సరం కూడా జిల్లా కలెక్టర్ పమేల సత్పతి మార్గదర్శకమున జిల్లా స్థాయి బాల వైజ్ఞానికప్రదర్శన 2025 -26 సంవత్సరానికి , జిల్లా స్థాయి ఇన్స్పైర్ అవార్డ్స్ ప్రదర్శన 2024 25 సంవత్సరానికి ఘనంగా నిర్వహించడానికి అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలను వేదికగా ఎంపిక చేసామని , అన్ని వసతులతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అందరం



కూడా కృషి చేయాలని చెప్పారు.

ఈ ప్రదర్శనకు మొత్తం 717 నమూనాలు నమోదు చేయడం జరిగిందని, ఇందులో నుండి 7 జూనియర్ & 7 సీనియర్ రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందని , ఇన్స్పైర్ అవార్డ్స్ ప్రదర్శనకు 126 నమూనాలు నమోదు చేయబడినయని ఇందులో నుండి 13 నమూనాలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందని చెప్పారు.

ప్రదర్శనకు వివిధ పాఠశాలల యజమాన్యాలు , ఉపాధ్యాయులు అందరు కూడా సహకరించి చక్కటి సమన్వయంతో విజయవంతం చేయాలని ఆహ్వానించారు.

అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో నిర్వహిస్తున్నటువంటి ప్రతి వేడుక విజయవంతంగా జరిగాయని తెలుపుతూ ఈ ప్రదర్శన కూడా చాలా



గొప్పగా జయప్రదం కావాలని ఆకాంక్షించారు.

విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ చాలా చక్కటి అవకాశం విశ్వాసంతో విద్యాసంస్థలకు ఇచ్చినందుకు జిల్లా పరిపాలనిధికారి పమేలా సత్పతి, కి ధన్యవాదాలు తెలియజేశారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల పక్షాన పాఠశాలను వేదికగా ఇవ్వడం జరిగిందని , ఈ వేదికగా విద్యార్థులకు మధ్యాహ్నం భోజన వసతి కల్పించడం జరుగుతుందని తెలిపారు.

విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వారి యొక్క ప్రతిభను చాటాలని సూచించారు. విద్యార్థులకు అన్ని విధాలుగా విద్యాసంస్థల వారి తరపున చేయుత అందిస్తామని వారికి ఎటువంటి లోటు రాకుండా చక్కటి ప్రదర్శనకు గొప్ప వేదిక అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మెయిన్ థీమ్

అభివృద్ధి చెందిన భారతదేశం మరియు స్వయం సమృద్ధి భారతదేశం

సబ్ థీమ్స్

1. సుస్థిర వ్యవసాయం
2. వ్యర్థ పదార్థాల నిర్వహణ , ప్రత్యామ్నాయ మొక్కలు
3. హరిత శక్తి
4. అభివృద్ధి చెందుతున్న సాంకేతికత
5. వినోదపరితమైన గణిత నమోనాలు
6. ఆరోగ్యం , పరిశుభ్రత
7. నీటి సంరక్షణ , నిర్వహణ

ఈ మూడు రోజుల ప్రదర్శనకు జిల్లా కలెక్టర్ చైర్ పర్సన్, జిల్లా విద్యాధికారి కన్వీనర్ గా, జిల్లా సైన్స్ అధికారి కో కన్వీనర్ వ్యవహరిస్తారని చెప్పారు.

ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కట్ట ఆనందం , డీసీఇబీ కార్యదర్శి భగవంత రావు , కరీంనగర్ , రాజన్న సిరిసిల్ల జిల్లా అటల్ టింకరింగ్ ల్యాబ్స్ సమన్వయకర్త అనంత చార్య , మిల్కూరి శ్రీనివాస్ , జిల్లా ప్రణాళిక సమన్వయకర్త, పాఠశాల సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి పెరుగుదల

**– యోగా గురువు ఎలిగేటి కృష్ణ**



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

యోగాతో విద్యార్థుల్లో జ్ఞాపకశక్తితో పాటు శారీరక మానసిక దృఢత్వం పెరుగుతుందని యోగా గురువు ఎలిగేటి కృష్ణ అన్నారు. గురువారం ఆయుష్ ఆరోగ్య మందిర్ ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్ లో ఒక్కరోజు యోగా శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు కృష్ణ మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం విద్యార్థులు యోగ, ప్రాణాయామాలు చేయడం ద్వారా జీర్ణ వ్యవస్థ, ఏకాగ్రత మెరుగుపడడంతో పాటు ఆరోగ్యవంతంగా ఉంటారని అన్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులకు యోగ శిక్షణ అందించడం వలన విద్యార్థుల్లో క్రమశిక్షణ, శారీరక పెరుగుదలకు ఎంతో దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం మేనేజర్ ఎన్. తిరుపతి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వరూప పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# తిరుమల శ్రీవారి సేవలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గురువారం వేకువజామున వారి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు.. స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ప్రభుత్వ విప్ కుటుంబ సభ్యులకు ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలంతా పాడి పంటలతో సుఖసంతోషాలతో ఉండాలని,ప్రజా ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అభివృద్ధి కార్యక్రమాలు,వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ముందుకు సాగాలని అ ఏడుకొండల వెంకటేశ్వర స్వామి వారిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు.

# కృషి విజ్ఞాన కేంద్రం సేవలు ప్రశంసనీయం : సింగిరెడ్డి కృష్ణారెడ్డి

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట:నవంబర్ 27**

వ్యవసాయ పరిశోధనలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ రైతులకు మార్గదర్శకంగా నిలుస్తున్న జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) సేవలు ప్రశంసనీయం అని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి అభినందించారు.

చొప్పదండి మండల రైతులతో కలిసి ఆయన జమ్మికుంట ప్రకాశం కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించి శాస్త్రవేత్తలతో సమావేశమయ్యారు. పురాతన దేశీయ వరి వంగడాల ప్రదర్శన, జీవవనరుల సంరక్షణ కేంద్రం, సహజ వ్యవసాయం ప్రాజెక్టులపై వివరాలు తెలుసుకున్నారు. గడిచిన సంవత్సరం నుంచి 1,483 మంది రైతుల పొలాలలో సహజ వ్యవసాయాన్ని ప్రవేశపెట్టామని, రాబోయే రెండు సంవత్సరాల్లో 10 వేల ఎకరాల్లో 6 వేల మంది రైతులతో





సహజ వ్యవసాయాన్ని విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని కేవీకే శాస్త్రవేత్తలు తెలిపారు. రసాయన గ్రోత్ ప్రమోటర్లకు బదులుగా చేపల వ్యర్థాలు, మజ్జిగ, బెల్లంతో తయారుచేసిన సహజ గ్రోత్ ప్రమోటర్ మంచి ఫలితాలు ఇస్తోందని వివరించారు.

ఆవు మూత్ర సేకరణ కోసం తక్కువ ఖర్చుతో ఏర్పాటు చేసిన ప్రత్యేక ట్యాంక్‌ను రైతులకు చూపించిన శాస్త్రవేత్తలు, దీన్ని సహజ కీటకనాశిని గ్రోత్ ప్రమోటర్ తయారీలో విజయవంతంగా వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు, వ్యవసాయ సిబ్బందికి నిరంతర శిక్షణలు అందిస్తూ సమర్థ యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నామని సీనియర్ శాస్త్రవేత్త వెంపటేశ్వరరావు తెలిపారు.

కేవీకే మార్గదర్శకత్వంలో అనేక మంది రైతులు జాతీయ అవార్డులు సాధించడాన్ని సింగిరెడ్డి కృష్ణారెడ్డి అభినందించారు. మోడీ ప్రభుత్వం వ్యవసాయ బడ్జెట్‌ను ఆరు రెట్లు పెంచడం, ఎరువుల సబ్సిడీని మూడింతలు చేయడం ద్వారా రైతులపై భారం తగ్గించిందని ఆయన చెప్పారు. రసాయన రహిత సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో కేవీకే మత్స్య విభాగ శాస్త్రవేత్త జి. ప్రభాకర్, ప్రోగ్రాం అసిస్టెంట్ కే. సుప్రజ, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు కోఆర్డినేటర్ కుమార్ యాదవ్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ములుగూరి సమ్మి రెడ్డి, రైతులు మొగిలి మహేష్, రాపల్లి శ్రీనివాస్, గుండె వెంకటేష్, కాయిత సాయి తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలను నిర్మూలిదాం..



**కరపత్రం ప్రతినిది, గోదావరిఖని నవంబర్ 27:**



పాలకుర్తి మండలంలోని కుక్కలగూడూర్ జెడ్పీహెచ్ఎస్ లో బాల్య వివాహాలను అరికట్టడంతో పాటు విద్యార్థులు ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడం ద్వారానే భవిష్యత్తులో మంచి ఫలితాలు సాధించవచ్చునని పెద్దపల్లి జిల్లా మహిళా సాధికారిత కేంద్రం సమన్వయకర్త డా.దయా అరుణ అన్నారు. పెద్దపల్లి జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలన అనే అంశంపై అవగాహన కల్పించారు. లింగ వివక్షత, బాలల హక్కులు, ఉన్నత విద్య, ఫోక్సో చట్టం, సఖి సేవలు, టోల్ ఫ్రీ నంబర్లు - 1098, 181, 112, 144567, 155326 గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు సుమతి, అంగన్వాడి సూపర్వైజర్ సువర్ణ, టీచర్లు, ఎ ఎన్ ఎం, ఆశాలు, పంచాయతీ కార్యదర్శి, షి టీమ్ కానిస్టేబుల్ సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

# హుజురాబాద్‌లో సుందరీకరణ పనులకు మరిన్ని నిధులు కేటాయిస్తామని ప్రణవ్

**కరపత్రం ప్రతినిధిహుజురాబాద్ నవంబర్ 27**

హుజురాబాద్ పట్టణ సుందరీకరణలో భాగంగా చేపట్టిన వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్ పార్క్ నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ గురువారం పరిశీలించారు. మోడల్ చెరువులో జరుగుతున్న పనుల పురోగతిని ఆయన స్థానిక నాయకులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ, విశాల విస్తీర్ణం కలిగిన మోడల్ చెరువు ఇన్ని రోజులు అభివృద్ధిని చూడకపోవడం దురదృష్టకరమన్నారు. గత పాలకులు గొప్ప పరిపాలన చేశామని చెప్పుకుంటూ కూడా చెరువును నిర్లక్ష్యం చేయడం ప్రజలు గమనించాల్సిన విషయమని వ్యాఖ్యానించారు.

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే హుజురాబాద్ అభివృద్ధి కోసం 15 కోట్ల రూపాయలు



మంజూరు చేసినట్లు తెలిపారు. పిల్లలకు వినోదం, ప్రజల ఆహ్లాదం కోసం ప్రత్యేకంగా చిల్డ్రన్ పార్క్, వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి నిధులు కేటాయించినట్టు పేర్కొన్నారు. చెరువుకు చేరుకోవడాన్ని ఇబ్బందిగ ఉన్న పిచ్చిమొక్కలను కూడా గత పాలకులు తొలగించలేదని ప్రశ్నించారు.

మోడల్ చెరువుతో పాటు గంగోనికుంట చెరువును కూడా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేసిన ప్రణవ్,



హుజురాబాద్ పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. గత పాలకులు అభివృద్ధి కంటే బురద చల్లే రాజకీయాలపైనే దృష్టి పెట్టారని విమర్శించారు.

ఈ పరిశీలన కార్యక్రమంలో హుజురాబాద్ కమిషనర్ సమ్మయ్య, కాంగ్రెస్ నాయకులు, స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపన్యాస పోటీలు

**కరపత్రం ప్రతినిధి, జ్యోతి నగర్(రామగుండం), నవంబర్ 27:**



ఆంగ్లం సబ్జెక్ నైపుణ్యం పెంపొందేందుకు ఎల్టా చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా ఎన్టీపీసీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంగ్లీషు లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం పలు పోటీలు నిర్వహించారు. రామగుండం మండల స్థాయిలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఇంగ్లీషు ఒలింపియాడ్ కంప్రెహంట్షన్ ప్యాసేజెస్, ఉపన్యాస పోటీలు ఏర్పాటు చేశారు. పెద్దపల్లి జిల్లా ఎల్టా స్థాపకులు గడ్డం జగదీశ్వర్ హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు ఆంగ్లం సబ్జెక్ నైపుణ్యం పెంపొందేందుకు, పబ్లిక్ పరీక్షలలో మంచి మార్కులు సాధించేందుకు, ఆంగ్లం నైపుణ్యాలు పెంపొందించే వివిధ రకాల పరీక్షంశాలు ఉపయోగ పడుతాయన్నారు. విద్యార్థుల్లో ఆంగ్లం అంటే భయం పోగొట్టడానికి ఈ పోటీలు ఉపయోగపడతాయని తెలిపారు. మండల విద్యాధికారి జి.మల్లేష్ ఎల్టా చేపట్టిన కార్యక్రమం, సేవలు కొనియాడారు. విద్యార్థులు మాట్లాడిన పుస్తక పఠనం ఉపయోగాలు, విద్యా నేర్చుకోవడంలో టెక్నాలజీ అందిపుచ్చుకొనే విధంగా మాట్లాడిన ఉపన్యాసాలు.. జీవిత ఆశయాలు, సోషల్ మీడియా వల్ల అనర్థాలు అంశాలపై మాట్లాడిన ఉపన్యాసాలు బాగున్నాయన్నారు. ఈ పోటీలలో మండలం నుంచి జిల్లాకు ఎంపికైన యోగేశ్వరీ, ఇబ్రహీం, నువీద్, అక్షరలను అభినందించారు. జిల్లాకు ఎంపికైన విద్యార్థులకు డి.సి.ఇ.బి. కార్యదర్శి హనుమంతు, ఎం.ఇ.ఓ.లు మల్లేష్, రాజయ్య, కాంప్లెక్ ప్రధానోపాధ్యాయులు జయరాజ్ , ఎల్టా మండల కోఆర్డినేటర్ లక్ష్మణ్ పాల్గొన్నారు. ఆంగ్లం ఉపాధ్యాయులు సునీత, సత్యనారాయణ, ఉమామహేశ్వర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# ఎలక్షన్ చెక్ పోస్ట్ ను తనిఖీ చేసిన ఇంచార్జి కలెక్టర్

**– రుద్రంగి ఆర్ఓ కేంద్రం పరిశీలన అధికారులకు పలు సూచనలు**

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా సరిహద్దులో రుద్రంగి వద్ద ఏర్పాటు చేసిన ఎస్ ఎస్ టీ చెక్ పోస్ట్ ను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ప్రతి వాహనాన్ని పకడ్బందీగా తనిఖీ చేయాలని ఆదేశించారు. అనంతరం రుద్రంగి లో ఏర్పాటు చేసిన ఆర్ఓ కేంద్రాన్ని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తనిఖీ చేశారు. హెల్ప్ డెస్క్, పోలీస్



బందోబస్తు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, సపోర్టింగ్ స్టాఫ్ సరిపడా ఉన్నారా అని ఆరా తీశారు. నోటీసు బోర్డులపై నోటిఫికేషన్ పత్రాలను ప్రదర్శించారా అని తనిఖీ చేశారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తూచ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా, పై అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ శేషాద్రి, తహసీల్దార్ పుష్ప లత, ఎంపీడీఓ నటరాజ్, చందుర్తి సిఐ వెంకటేశ్వర్లు, ఎస్సై తదితరులు పాల్గొన్నారు.